
ఆంధ్రజ్యోతి ***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 18 ఏప్రిల్ 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.158	230	262
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.158	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 42.5 , కనిష్ఠం 24.8

చూడముచ్చటగా సీతారాముల పరిణయం
జిల్లావ్యాప్తంగా వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

వేదమంత్రోచ్ఛరణలు.. మంగళవాయిద్యాలు.. గుండెల నిండా రామనామస్మరణతో జిల్లా మారుమోగింది. సకల గుణాభిరాముడు, సద్గుణవతి సీతాదేవి పరిణయ వేడుక బుధవారం చూడముచ్చటగా సాగింది. ముందుగానే అందంగా అలంకరించిన రామాలయాల్లో భక్తులకు ఏర్పాట్లు చేయడంతోపాటు కల్యాణవేదికలను ముస్తాబు చేశారు. క్రోధినామ సంవత్సర చైత్రశుద్ధ నవమి పునర్వసు నక్షత్రం, కర్కాటక రాశి, అభిజిత్ లగ్న సుముహూర్తమున స్వామివారు అమ్మవారి మెడలో మాంగళ్య దారణ చేశారు. ఎంతో ఆధ్యాత్మికతను నింపుకున్న ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా సంప్రదాయరీతిలో ఎదుర్కోలు ఉత్సవాలు నిర్వహించారు. అన్నదానం, ప్రసాద వితరణ చేశారు. రాత్రికి కల్యాణ మూర్తులను పల్లకిలో ఊరేగించారు. వేద పండితులు శ్రీరామ నవమి విశిష్టతను వివరించారు.

\- నల్లగొండ

కమనీయం రమణీయం
రాములోరి కళ్యాణం







నల్లగొండలో సీతారాముల పల్లకిని మోస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



రామాలయంలో తలంబ్రాల వేడుక

ఎన్నికల షెడ్యూల్

- ఈ నెల 18న నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ
- 25న నామినేషన్లకు చివరి గడువు
- 26న నామినేషన్ల పరిశీలన
- 29న నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు
- మే 13న పోలింగ్
- జూన్ 4న ఓట్ల లెక్కింపు



నామినేషన్ల స్వీకరణకు సిద్ధమైన కలెక్టరేట్

సమరం షురూ

- నేడు లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్
- ఈ నెల 18 నుంచి 25వరకు నామినేషన్ల స్వీకరణ
- భువనగిరి కలెక్టరేట్ వద్ద ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 11 నుంచి 3గంటల వరకు

సార్వత్రిక ఎన్నికల సమరం ప్రారంభంకానుంది. మైకుల మోతలు.. ప్రచార హోరుతో నామినేషన్ల పర్వం మొదలు కానుంది. ఇప్పటికే వేడెక్కిన వాతావరణం.. మరింత ఉద్విగ్నంగా మారనుంది. ప్రతిపక్షాల ఆరోపణలు.. అధికార పక్షం ఎదురు దాడులతో రసవత్తరం కానుంది. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో, నల్లగొండ పార్లమెంట్ స్థానానికి నల్లగొండ జిల్లాకేంద్రంలో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇందుకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు.

\- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

లోక్‌సభ నియోజకవర్గస్థాయిలో గురువారం నోటిఫికేషన్ జారీ చేసేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ మేరకు భువనగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే సంబంధిత అధికారులతో సమీక్షించారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, జనగామ జిల్లాల్లో విస్తరించి ఉంది. జిల్లాలోని భువనగిరి, ఆలేరు, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, జనగామ జిల్లాలోని జనగామ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈ నియోజకవర్గంలో 18 లక్షల మంది ఓటర్లున్నారు. భువనగిరి నియోజకవర్గం విస్తీర్ణంపరంగా పెద్దది కావడంలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆయా నియోజకవర్గాల్లోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు(ఏఆర్వోలు), వివిధ శాఖల అధికారులతో ఎన్నికలపై సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి జిల్లాస్థాయిలో నోడల్ అధికారులను నియమించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులు గా వ్యవహరించిన వారు ప్రస్తుతం ఏఆర్వోలుగా ఉంటారు. వీరికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ పూర్తిచేశారు. నామినేషన్ల స్వీకరణ, ఎన్నికల కోడ్ అమలు,సీ-విజిల్,తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

పర్యవేక్షణ కట్టుదిట్టం

ఎన్నికలను సజావుగా పారదర్శకంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, అభ్యర్థుల ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కట్టుదిట్టంగా చేయించేందుకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్, వీడియో వ్యూయింగ్, మోడల్ కోడ్ అఫ్ కండక్ట్, సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీంలను ఏర్పాటుచేశారు. ఈ నియోజకవర్గంలో 2,141 పోలింగ్ కేంద్రా లు ఉన్నాయి. పోలింగ్ నిర్వహణకోసం అవసరమైన పోలింగ్ అధికారు లు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులను గుర్తించారు. ఈ ఎన్నికల నిర్వహణకు మొత్తం పోలీసు సిబ్బందితో కలిపి 20వేలకు పైగా మంది విధులు నిర్వర్తించనున్నారు. పోలింగ్‌కు వినియోగించేందుకు ఈవీఎం ల పరిశీలన మొదటి దశ పూర్తయింది. అన్నిరాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. మరోసారి కూడా పరిశీలించనున్నారు.

నల్లగొండలో..

నల్లగొండ : కలెక్టరేట్ ఆవరణలో భద్రత కట్టుదిట్టం చేశారు. కలెక్టర్ కార్యాలయానికి 100 మీటర్ల దూరం వరకు మాత్రమే ర్యాలీకి అనుమతి ఉంటుంది. అభ్యర్థుల వెంట నలుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతిస్తారు. అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఈ నెల 25న నామినేషన్లకు చివరి గడువు. అభ్యర్థితోపాటు ఐదుగురికి మాత్రమే నామినేషన్లు వేసే కార్యక్రమానికి అనుమతి ఉంటుంది. అదేవిధంగా ఒక్కో అభ్యర్థికి మూడు వాహనాలకు మాత్రమే నామినేషన్లు వేసే ప్రాంతానికి అనుమతిస్తారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు సంబంధించి జనరల్ అభ్యర్థులు నామినేషన్ సందర్భంగా రూ.25వేలు డిపాజిట్ చేయాల్సి ఉండగా, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 చెల్లించాల్సి ఉంటుంది. నామినేషన్‌తోపాటు ఫాం-26 ద్వారా అఫిడవిట్ దాఖలు చేయాలి. నామినేషన్లు వేసే ప్రాంతంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలి

భువనగిరి అర్బన్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఈసీ సమీక్షించి మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. బూత్‌లెవల్‌లో ఓటింగ్‌శాతం పెంచేలా సెక్టార్ అధికారులతో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్లు కూడా ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేసే విధంగా చర్యలు తీసుకోవడమేకాక అర్బన్ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు ఎన్నికల నిర్వహణపై హెల్ప్‌డెస్క్ ద్వారా వివరించాలన్నారు. ఈవీఎం రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులు పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వికాస్‌రాజ్

నామినేషన్ల ప్రక్రియకు పటిష్ఠ బందోబస్తు : ఎస్పీ

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చందనా దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 25వ తేదీ వరకు జరుగుతుందన్నారు. సెంట్రల్ ఫోర్స్ ఆర్మ్‌డ్, సివిల్ ఫోర్స్‌తో మూడంచల భద్రతా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా శాంతిభద్రతల సమస్యలు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు పరంగా అన్ని భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రిటర్నింగ్ కార్యాలయానికి 100మీటర్ల లోపల అభ్యర్థితో పాటు నలుగురు వ్యక్తులు మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు.

భువనగిరిలో మొత్తం 18,04,930 ఓటర్లు

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో 18,04,930 ఓటర్లు ఉన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు ఓటు నమోదుకు అవకాశం ఉండటంతో మరింత మంది ఓటర్లు పెరిగే అవకాశం ఉంది. నియోజకవర్గంలోని ఓటర్ల తుది జాబితాను జిల్లా యంత్రాంగం ఇటీవల ప్రకటించింది. భువనగిరి నియోజకవర్గంలో మొత్తం 18లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 8,96,219, మహిళలు 9,08,632, ఇతరులు 79 మంది ఓటర్లు ఉన్నారు.

పవర్ ప్లాంట్ అవినీతిలో
జగదీష్‌రెడ్డి జైలుకే

● మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 17 : యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో జరిగిన అవినీతి అక్రమాల విషయంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని ఆయనకు బెయిల్ కూడా రాదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ నిర్మాణానికి రూ.29వేల కోట్ల అంచనా ఉండగా, దానిని రూ.50వేల కోట్లకు పెంచారని ఆరోపించారు. ఈ జిల్లాకు జగదీష్‌రెడ్డి శనిగా దాపురించారని అన్నారు. నల్లగొండ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. జిల్లా కేంద్రంలోని ఐటీ హబ్‌లో 25మంది ఉద్యోగులే ఉన్నారని, ఆ భవనం గబ్బిలాలకే పరిమితమైందన్నారు. గతంలో తాము ఎంజీయూ యునివర్సిటీలో ఐటీ హబ్ కోసం 70 ఎకరాలను సేకరించామని గుర్తుచేశారు. త్వరలోనే టీసీఎస్ కంపెనీతో ఒప్పందం చేసుకుని ఐటీ హబ్‌లో 1000మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి మంచి వేతనం ఇచ్చేలా చూస్తామన్నారు. నల్లగొండలో తాగునీటి అవసరాలను తీర్చడం కోసం 12 ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మిస్తామన్నారు. రాబోయే మూడేళ్లలో హైదరాబాద్ - విజయవాడ మధ్యలో ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మిస్తామన్నారు. జూన్ 5 నుంచి తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో పాలన ప్రారంభిస్తుందని తెలిపారు. నల్లగొండ పట్టణంలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం రూ.700కోట్లు వెచ్చిస్తామని, జూన్‌లో టెండర్లు ఆహ్వానిస్తామన్నారు. దీనికి సంబంధించి డీపీఆర్ అలైన్‌మెంట్ సిద్ధమైందన్నారు. జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో రూ.90కోట్లతో నీలగిరి నిలయం నిర్మిస్తామని అందులో కల్చరల్ ప్రోగ్రాంలతో పాటు పెళ్లిళ్లు కూడా జరిగేలా డిజైన్ రూపొందించడం జరిగిందన్నారు. నల్లగొండలో గత ప్రభుత్వ హయాంలో అప్పటి నల్లగొండ మునిసిపల్ కమిషనర్ రూ.50కోట్లను నామినేటెడ్ పద్ధతిన దోచుకున్నాడని ఆ సొమ్మును ఆయన తీసుకున్నాడో, అప్పటి ప్రజాప్రతినిధులకు ఇప్పించాడో తెలియదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మయ్యలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో లిఫ్ట్ పనిచేయకపోవడంపై ఆగ్రహం



ఆస్పత్రిలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

జిల్లా కేంద్ర ఆసుపత్రిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం సందర్శించారు. మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో లిఫ్ట్ పనిచేయకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సిబ్బంది లిఫ్ట్ రిపేరు చేయడానికి 10రోజులు పడుతుదంటూ సమాధానం చెప్పడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రిపేరుకు అంత సమయం పడితే రోగుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రోగులు, సహాయకులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా నూతన భవన నిర్మించాలని అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. భవన నిర్మాణం నెల రోజుల్లోనే పూర్తి చేసేలా యుద్ధ ప్రాతిపాదికన చర్యలు చేపట్టాలన్నారు. మంత్రి వెంట మునిసిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్యారెంటీ పథకాలకు ప్రజల మన్ననలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

నకిరేకల్, ఏప్రిల్ 17 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని అమలు చేసి ప్రజల మన్నన పొందిందని భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నకిరేకల్‌లోని శ్రీనివాస ఫంక్షన్ హాల్లో బుధవారం రాత్రి జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ కార్యకర్తలు ఐక్యతతో కలిసి పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివర్గాల పేద ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. భువనగిరి పార్లమెంట్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ఈ నెల 21వ తేదీన కిరణ్‌కుమార్‌రెడ్డి వేసే నామినేషన్‌కు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కార్యచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, శాసన మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్, ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, రాష్ట్ర నాయకులు దైద రవీందర్, కొండేటి మల్లయ్య, పూజార్ల శంభయ్య, చామల శ్రీనివాస్, బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు, కోమటిరెడ్డి చిన్న వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్.. నేనే బాస్!

- తల్చుకున్నానంటే 120మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది అవుట్
- రెండు నెలల్లో ఇంటిబాట పట్టిస్తానంటూ డీసీసీబీలో ఓ అధికారి అల్టిమేటం
- వణికిపోతున్న చిరుద్యోగులు



రెండు నెలల్లో ఇంటికి వెళ్లిపోతారు

నల్లగొండ, ఏప్రిల్ 17 : జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో చిరుద్యోగులు అభద్రతతో వణికిపోతున్నారు. ఉద్యోగం పర్మినెంట్ అవుతుందన్న ఆశతో ఉన్న వారిని ఉన్న ఉద్యోగం ఊడిపోతుందన్న భయం వెంటాడుతోంది. డీసీసీబీ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆయా బ్రాంచ్‌లు, పీఏసీఎస్‌లు, జిల్లా కార్యాలయంలో 120మంది వరకు అవుట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్నారు. కొందరు 20 నుంచి 25 ఏళ్లుగా, మరికొందరు 10 నుంచి 12 ఏళ్లుగా, ఇంకొందరు 5 నుంచి 7 ఏళ్లుగా పనిచేస్తున్నారు. అయితే కొద్దిరోజులుగా వారికి ఉద్యోగ భద్రతపై నమ్మకం పోతోంది. పర్మినెంట్ కోసం గతంలో కొందరు కోర్టును ఆశ్రయించగా, మరికొందరు పాలకవర్గాలపై నమ్మకం పెట్టుకుని పనిచేసుకుంటూపోతున్నారు. అయితే పర్మినెంట్ ఏమోకాని ఉన్న ఉద్యోగం కూడా పోతుందన్న భయం వారిని నీడలా వెంటాడుతోంది.

డీసీసీబీలోని ఓ ఉన్నతాధికారి తీసుకుంటున్న నిర్ణయాలు చిరుద్యోగులను హడలెత్తిస్తోంది. రెండు నెలల్లో అవుట్ సోర్సింగ్ సిబ్బందిని ఇంటిబాట పట్టిస్తానని అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం. డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో పాటు పాలకవర్గం అంతా అవుట్ సోర్సింగ్ సిబ్బందికి మద్దతు ఉండగా సదరు అధికారి మాత్రం ఆ సిబ్బందిని తొలగించి తీరుతానని భీష్మించినట్లు చర్చ సాగుతోంది. ఇటీవల జరిగిన ఎంసీ మీటింగ్‌లో అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించకూడదని పాలకవర్గం నిర్ణయించినట్లు సమాచారం. అయితే అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఖజానాకు నష్టం వాటిల్లుతోందని వారితో ఉపయోగం లేదన్న విధంగా ఆ అధికారి వితండా వాదన చేయడం పాలకవర్గాన్ని సైతం ఆశ్చర్యాన్ని కలిగించినట్లు తెలిసింది. రైతుల కోసం ఏర్పడిన డీసీసీబీ ప్రస్తుతం పాలకవర్గం ఏర్పడక ముందు అప్పటికే 103 ఏళ్ల చరిత్ర ఉండగా కేవలం రూ.900కోట్ల టర్నోవర్ మాత్రమే ఉంది. గత నాలుగేళ్లలో ఈ పాలకవర్గం కాలంలోనే రూ.1400కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. అంటే మొత్తం 107 ఏళ్ల బ్యాంకు చరిత్రలో రూ.2300కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. దీంతో పాటు బ్యాంకు లాభాల బాటలో పయనిస్తున్న సమయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తానని చెప్పడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్న తలెత్తుతోంది. అదేవిధంగా రూ.30.16కోట్ల గ్రాస్ ప్రాఫిట్ ఉండగా ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.22.42కోట్ల నెట్ ప్రాఫిట్‌కు చేరింది. ఇంతా పెద్దఎత్తున లాభాలు ఉన్నా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఏ ప్రతిపాదికన తొలగించాలని ఆలోచిస్తున్నారో అర్థకావడంలేదని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

ఆ సార్‌ను కలవాలంటే పీఏ ద్వారా వెళ్లాల్సిందే

గతంలో లేని కొత్తవిధానం డీసీసీబీలో నడుస్తోందని అధికారులు, ఉద్యోగులు వాపోతున్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, జిల్లా కార్యాలయంతో పాటు పీఏసీఎస్ సీఈవోలు, బ్రాంచీల మేనేజర్లు, ఉన్నతాధికారులు సైతం ఆ సార్‌ను కలవాలన్నా, ఫైల్‌ల పరిశీలన జరగాలన్నా పీఏ ద్వారానే అన్న పరిస్థితి ఏర్పడింది. డీసీసీబీలో గతంలో పనిచేసిన ఏ ఉన్నతాధికారి వారి ఛాంబర్ల వద్ద అటెండర్‌కు మించి ఉద్యోగి ఉండరు. అయితే ప్రస్తుతం ప్రత్యేకంగా ఓ పీఏనే నియమించుకున్నారు. బ్యాంకు అధికారులతో పాలకవర్గ నిర్ణయాలను చర్చించి ఫైల్స్‌ను క్లియర్ చేయాల్సింది పోయి అధికారులను, ఉద్యోగులను ఛాంబర్‌లోకి రానివ్వడమే మాన్పించినట్లు తెలుస్తోంది. పూర్తిగా ఆ పీఏతోనే ఫైల్ డిస్కస్ చేసి మిగతా సమాచారాన్ని పీఏ ద్వారానే చేరవేయడం తప్ప వారిని కనుచూపు మేరలోకి రానివ్వడం లేదని సమాచారం. రాజకీయ నాయకులతో మమేకమై ఉన్న డీసీసీబీలో అధికారులు, ఉద్యోగులు, సదరు ఉన్నతాధికారి మధ్య కోల్డ్‌వార్ మొదలైంది. ఆ అధికారి ఏకపక్ష నిర్ణయాలతో పాలకవర్గం ఎలాంటి ఆలోచన చేస్తుందో వేచి చూడాల్సిందే.

సిబ్బంది తొలగింపుపై నిర్ణయం జరగలేదు: శంకర్‌రావు, సీఈవో, డీసీసీబీ

అవుట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపు విషయం కొన్ని రోజుల క్రితం పాలకవర్గ మీటింగ్‌లో ఇంటర్నల్‌గా చర్చించిన విషయం వాస్తవమే. అయితే వారిని తొలగించ కూడదని, ప్రస్తుతానికి నిర్ణయించాం. వారిని కొనసాగించాలనే ఆలోచనకు వచ్చాం.

22క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

డిండి, ఏప్రిల్ 17: వాహనంలో తరలిస్తున్న 22క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నల్లగొండ జిల్లా డిండి మండలంలోని చెర్కుపల్లి స్టేజీవద్ద అధికారులు బుధవారం పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని బొలెరో వాహనంలో తరలిస్తున్నారన్న సమాచారంతో డీటీసీఎస్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ చెర్కుపల్లి స్టేజీవద్ద స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. బియ్యం తరలిస్తున్న చందంపేట మండలం నల్లచలమూల గ్రామానికి చెందిన ముత్యాలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. చందంపేట మండలంలో సేకరించిన రేషన్ బియ్యాన్ని వాహనంలో డిండి మండలంలోని రైస్‌మిల్లుకు తరలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



చెర్కుపల్లి స్టేజీవద్ద పోలీస్, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

శేశిలేటివాగులో మంటలు

గుర్రంపోడు, ఏప్రిల్ 17: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలోని శేశిలేటివాగులో బుధవారం సాయంత్రం మంటలు దట్టంగా వ్యాపించాయి. గుర్తుతెలియని వ్యక్తులు మంట పెట్టి ఉంటారని అనుమానిస్తున్నారు. శేశిలేటివాగులో జమ్ము ఉండడంతో పశువులు, మేకలు మేసేందుకు వీలు లేకుండా ఉంది. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు జమ్మును తొలగించేందుకు నిప్పు పెట్టి ఉంటారని భావిస్తున్నారు. వాగులో మంటలు వ్యాపించడంతో రైతులకు సంబంధించిన పైపులు, మోటార్లు, విద్యుత్ వైర్లు దగ్ధమైనట్లు తెలిసింది. మంటలు వ్యాపించడంతో ప్రజలు ఎవరూ అక్కడికి వెళ్లడం లేదు. స్థానికులు అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం ఇచ్చారు. నల్లగొండ నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పుతున్నారు.



శేశిలేటివాగులో ఎగిసిపడుతున్న మంటలు

గుట్టలో వైభవంగా సీతారాముల కల్యాణం

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 17: యాదగిరిక్షేత్రంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి అనుబంధ శివాలయంలో ఈ నెల 9 నుంచి చేపట్టిన వసంతోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. కల్యాణతంతులో భాగంగా నిత్యారాధనల అనంతరం అభిషేకం, ఆధ్యాత్మిక రామాయణ పారాయణం, స్వామిఅమ్మవార్లకు అష్టోత్తర శత నామార్చనలు చేశారు. వేదపండితులు, పురోహితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ మంగళవాయిద్యాలు మార్మోగుతుండగా స్వామిఅమ్మవార్లను వజ్ర వైఢూర్యాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠించి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. రాత్రి వేళ హనుమాన్‌మూర్తులకు సహస్ర నామార్చనలు, నివేదన నీరాజనం, మంత్ర పుష్పాలు, వేదపండితులు, పురోహితులు, అర్చకులు తీర్థప్రసాద వితరణ చేయగా కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి దంపతులు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో దూశెట్టి కృష్ణ, పర్యవేక్షకుడు రామారావు, పూజారి దోర్బల శ్రీధరశర్మ, ఉద్యోగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యకైంకర్యాలు భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నడుమ అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చన చేశారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణపర్వాలు ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన అర్చకులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు చేశారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వైభవంగా జరిగాయి. అదేవిధంగా కొండపై శివాలయంలో శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.12,15,058 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి కేసీఆర్ అభినందన



మహేందర్‌రెడ్డిని అభినందిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

యాదగిరిగుట్ట రూరల్, నల్లగొండ, ఏప్రిల్ 17: అప్పుల్లో ఉన్న ఉమ్మడి నల్లగొండ డీసీసీ బ్యాంకును లాభాల్లోకి తెచ్చిన డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని మాజీ సీఎం కేసీఆర్ అభినందించారు. ఆయన హైదరాబాద్‌లో కేసీఆర్‌ను బుధవారం కలిశారు. దేశంలోని 540 డీసీసీబీల్లో ఉత్తమ అవార్డుకు ఎంపికైన ఐదుగురిలో మహేందర్‌రెడ్డి ఒకరు కావడం రాష్ట్రానికే గర్వ కారణమని కేసీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, యాదాద్రిభువనగిరి జిల్లాకు చెందిన సింగిల్ విండో చైర్మన్లు మొరిగాడి మల్లేశంగౌడ్, ఎన్. పరమేశ్వర్‌రెడ్డి, రాంరెడ్డి, దామోదర్‌రెడ్డి, గూదె బాలనర్సయ్య, ఎస్. నర్సింహారెడ్డి, చింతలపురి భాస్కర్‌రెడ్డి, జంగారెడ్డి, భూపాల్‌రెడ్డి, గుండాల వైస్ చైర్మన్ పురుగుల మల్లేశయాదవ్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

తిప్పర్తి, ఏప్రిల్ 17: అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సర్వారం గ్రామానికి చెందిన గంట నాగరాజు గ్రామంలోని తన కిరాణ దుకాణంతో పాటు బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో విక్రయించడానికి అనుమతి లేనందున దుకాణంలో ఉన్న 43మద్యం క్వాటర్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. సీజ్ చేసిన మద్యం విలువ సుమారు రూ.8వేల వరకు ఉంటుందని తెలిపారు.



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యుటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



స్వామివారి ఊరేగింపు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



మాదిగలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోంది

● మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు



మాట్లాడుతున్న నర్సింహులు

భువనగిరి రూరల్, ఏప్రిల్ 17: మాదిగలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోందని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మా జాతి హక్కులు మాకు కల్పించడం లేదు' అని మంద కృష్ణ మాదిగ మాట్లాడిన దాంట్లో తప్పు లేదన్నారు. కడియం శ్రీహరిది ఏ కులమో ఆయనకే తెలియదన్నారు. మాదిగలకు జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ టికెట్లు కేటాయించాలని కాంగ్రెస్ అదిష్ఠానానికి విజ్ఞప్తి చేశామన్నారు. తెలంగాణలో దాదాపు 80లక్షల మంది మాదిగల జనాభా ఉన్నప్పటికీ ఆ జనాభాకంటే తక్కువ శాతం ఉన్న ఇతర కేటగిరీ కులస్థులకు ఒక్క ఇంటిలో ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఆ కుటుంబంలోనే మరో వ్యక్తికి ఎంపీ టికెట్ కేటాయించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన హక్కులను కాలరాస్తూ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ లమనే తమ కులస్థులకు ఇప్పటివరకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా ముఖం చాటేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికీ కాంగ్రెస్ పార్టీ నుంచి మారే ఉద్దేశం లేదని, మాదిగలకు జరుగుతున్న అన్యాయం, హక్కుల సాధనకు గురువారం బేగంపేటలోని లీలానగర్‌లో తన ఇంటి వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఈ దీక్షకు మేధావి వర్గం ప్రజాస్వామ్య వాదులు, ప్రజా సంఘాలు, ఎమ్మార్పీఎస్ నేతలు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం తెలపాలని కోరారు.

అనారోగ్యంతో యువతి ఆత్మహత్య



కనగల్, ఏప్రిల్ 17: అనారోగ్యంతో బాధపడుతున్న యువతి మనస్తాపంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలం పర్వతగిరి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ రామకృష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెనగాని క్రిష్ణయ్య, లక్ష్మమ్మ దంపతుల చిన్న కూతురు కావ్య(20) కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతోంది. ఎన్ని మందులు వాడినా వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్దిసేపటి తర్వాత ఇది గమనించిన కుటుంబసభ్యులు కావ్యను కిందికి దించి చికిత్స నిమిత్తం నల్లగొండ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెం దింది. కావ్య తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కావ్య హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతూ వారం రోజుల క్రితం గ్రామానికి వచ్చిందని స్థానికులు తెలిపారు.

కారు ఇంజన్‌లో మంటలు



మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 17: అధిక ఉష్ణోగ్రతల కారణంగా వాహనం ఇంజన్ వేడెక్కి మంటలు చెలరేగాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్‌లో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్మాణ సంస్థకు చెందిన టీఎస్ 05యూఈ 4865 నెంబర్ గల వాహనం అశోక్‌నగర్‌లో రోడ్డుపై వెళ్తున్న క్రమంలో ఆకస్మాత్తుగా ఇంజన్‌లో మంటలు వ్యాపించాయి. గమనించిన కారు డ్రైవర్ అప్రమత్తమై వాహనాన్ని నిలిపి వేశాడు. అప్పటికే ఇంజన్‌లో మంటలు వ్యాప్తించి కాలిపోతుండగా స్థానికుల సాయంతో సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపుచేశారు. బొలేరో వాహనంలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. అధిక ఉష్ణోగ్రతతో ఇంజన్ వేడెక్కడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ...



యాదయ్య(ఫైల్)

చిట్యాల రూరల్, ఏప్రిల్ 17: అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తూ ఒకరు అనంతలోకాలకు వెళ్లారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో బుధవారం జరిగింది. చిట్యాల ఎస్ఐ సైదబాబు తెలిసిన వివరాల ప్రకారం.. మండలంలోని పేరేపల్లికి చెందిన రూసని యాదయ్య(58) చిట్యాల పరిధిలో శివనేనిగూడెంలో తన బంధువు మృతి చెందగా అంత్యక్రియలకు వెళ్లి తన స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. వెలిమినేడు శివారులో జాతీయ రహదారి దశమి ల్యాబ్ ఎదురుగా యాదయ్య బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో యాదయ్య తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. యాదయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండకు తరలించారు.

బ్యాంకు క్యాష్ ఇన్‌చార్జిపై ఫిర్యాదు

వలిగొండ, ఏప్రిల్ 17: బ్యాంక్‌లో నగదు కొరత కారణంగా బ్యాంక్ క్యాష్ ఇన్‌చార్జిపై బ్రాంచి మేనేజర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) వలిగొండ బ్రాంచిలో క్యాష్ ఇన్‌చార్జిగా పని చేస్తున్న కాలేరు అనిల్‌కుమార్ ఏప్రిల్ 16వ తేదీ నుంచి విధులకు గైర్హాజరవుతున్నాడు. బుధవారం వరకు బ్యాంక్‌కు హాజరుకాకపోవడంతో బ్రాంచి మేనేజర్ సిబ్బందితో కలిసి అతని క్యాష్ క్యాబిన్‌ను తనిఖీ చేయగా రూ.15,50,000 నగదు కొరత కనిపించింది. పరారీలో ఉన్న ఉద్యోగి అనిల్‌కుమార్‌పై బ్రాంచి మేనేజర్ మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

రాజాపేట, ఏప్రిల్ 17: విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం కాల్వపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన కాకర్ల చంద్రకళ (55) బుధవారం ఇంట్లో నీళ్ల కోసం విద్యుత్ మోటార్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతంతో మృతిచెందింది. మోటార్ వైరు తేలి ఉండడంతో విద్యుదాఘానికి గురైంది. చంద్రకళకు భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రూ.75,800 నగదు పట్టివేత

తిరుమలగిరి, ఏప్రిల్ 17: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని ఈదులపర్రైతండాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద రూ. 75,800ల నగదును పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా కారులో తరలిస్తున్న ఈ నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

పాఠశాల ఆవరణలో ..

గుండాల, ఏప్రిల్, 17: యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం రాత్రి పూజలు చేసిన ఆనవాళ్లు కన్పించాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం పాఠశాలలో వాకింగ్ వెళ్లిన గ్రామస్థులకు పాఠశాల ఎదుట ఉన్న స్టేజీపైన పూజలు చేసినట్లు ఆనవాళ్లు కన్పించడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ యాకన్న సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ఆకతాయిలు చేసిన పని అని తెలిపారు.


చిట్యాల: ఉత్సవ విగ్రహాలను తీసుకువస్తున్న ఎమ్మెల్యే వీరేశం దంపతులు


దేవరకొండ : తలంబ్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్


హాలియా: కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి


మిర్యాలగూడ: కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, రఘువీర్‌రెడ్డి దంపతులు


హాలియా: రామాలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం జగమంతా వేడుకగా..ఊరంతా సందడిగా సాగింది. జిల్లా వ్యాప్తంగా కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆయా పట్టణాలు, గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పెళ్లి పెద్దలుగా కల్యాణంలో పాల్గొనగా, అర్చకులు పెళ్లితంతును సాగించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనగా అందరికీ అన్నప్రసాదం, పానకం అందజేశారు.


నల్లగొండ పట్టణంలోని రామాలయంలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న మంత్రి వెంకట్‌రెడ్డి, భక్తులు




నల్లగొండ వీటీ కాలనీలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న నాయకులు, భక్తులు


నల్లగొండ పట్టణంలో కల్యాణంలో పాల్గొన్న సైదిరెడ్డి, బీజేపీ నాయకులు


అయోధ్య నుంచి వచ్చిన పట్టు వస్త్రాలను అర్చకులకు అందజేస్తున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మునికుమార్


హాలియాలో పూజల్లో పాల్గొన్న సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి


కల్యాణంలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి

వైభవంగా రాములోరి కల్యాణం

● హాజరైన మంత్రి వెంకట్‌రెడ్డి ● అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా రెండో భద్రాద్రిగా పేరొందిన నల్లగొండ పట్టణంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో బుధవారం మధ్యాహ్నం సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళ వాయిద్యాలు మోగుతుండగా, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధికార లాంఛనాలతో కలెక్టర్ దాసరి హరిచందన, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి నివాసాల నుంచి తలంబ్రాలు, పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. యాజ్ఞికులు కల్యాణతంతు నిర్వహించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కల్యాణాన్ని తిలకించి పూజలు చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, ఈవో జయరామయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నాయకులు నరేందర్‌రెడ్డి, చైతన్య, సంధ్యారాణి, వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

● కేతేపల్లి మండలంలోని బండపాలెం గ్రామంలోని రాతిగుట్ట(సారంగాచలం)పై వెలసిన సీతారాముల విగ్రహాలను మేళతాళాలు, డప్పు చప్పుళ్లతో గుట్ట కిందకు తీసుకువచ్చి అక్కడ ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై కల్యాణతంతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం, టీపీసీసీ నాయకుడు చామల శ్రీనివాస్, ధైద రవీందర్ కల్యాణానికి హాజరై పూజలు చేశారు.

● నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో గల వేంకటేశ్వరస్వామి, రామాలయం, రైల్వే హెడ్‌క్వార్టర్స్‌లో, హనుమాన్ దేవాలయంతో పాటు పలు కాలనీల్లో జరిగిన కల్యాణంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి దంపతులు, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర నాయకులు శ్రీదేవిరెడ్డి, పిల్లి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

● హాలియాలో నిర్వహించిన వేడుకల్లో సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ అనుపమనరేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు కర్నాటి లింగారెడ్డి, దేవాలయ చైర్మన్ మేడేపల్లి మోహన్‌రావు, వెంకట్‌రెడ్డి, లింగారెడ్డి, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్)లో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి స్వామి, అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలు, తలంబ్రాలను తీసుకొచ్చి స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణంలో ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, మాజీ ఎంపీపీ చవ్వా బ్రహ్మానందరెడ్డి, నాయకులు పెద్దిరెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

● మిర్యాలగూడ మండలంలోని చిల్లాపురం సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి ఆలయంలో నియోజకవర్గ ప్రముఖులు మిట్టపల్లి వెంకటేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

● చిట్యాల పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహల ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వైస్‌చైర్మన్ లింగస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్‌లు వేర్వేరుగా పాల్గొని పూజలు నిర్వహించారు.

● మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డి కాలనీ రామాలయంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి దంపతులు, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

● దేవరకొండ పట్టణంలోని కోదండరామాలయం, పాత రామాలయంలో శ్రీరామనవమి పురస్కరించుకొని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కల్యాణ మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు.

● శాలిగౌరారం మండలం గురజాల గ్రామంలోని సీతా రామచంద్రస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం కన్నులపండువగా జరిగింది.


కొండమల్లేపల్లి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు


మిర్యాలగూడ: మిట్టపల్లి వెంకటేష్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


నల్లగొండ పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో కల్యాణం


బండపాలెంలో దేవతా విగ్రహాలను తీసుకువస్తున్న భక్తులు


నల్లగొండ, తిరుమలగిరి(సాగర్)లో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

అగ్నిమాపక వారోత్సవాలు

హాలియా, ఏప్రిల్ 17: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అనుముల గ్రామ కాలనీలో బుధవారం అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భం గా నివాస


అగ్నిప్రమాదంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలకు గురైనప్పుడు వాటిని ఎలా నివారించాలో కాలనీ ప్రజలకు వివరించా రు. ముఖ్యంగా ఇళ్లల్లో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ద్వారా అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఎలా ఆర్పివేయాలో ప్రదర్శన ద్వారా అగ్నిమాపక సిబ్బంది తెలియజేశా రు. అదేవిధంగా గృహాల్లో ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించే సమయంలో పా టించాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. ఏదైనా అగ్నిప్రమాదం జరిగినప్పుడు 101 నెంబర్‌కి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక అ ధికారి జె.జానయ్య, స్టేషన్ సిబ్బంది, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రఘువీర్‌రెడ్డి గెలిపించేందుకు కృషి చేయాలి

తిరుమలగిరి(సాగర్), ఏప్రి ల్ 17: కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ అభ్య ర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలు పు కోసం కార్యక


కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న జానారెడ్డి

ర్తలు కృషి చేయాలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. మండలంలోని ఎల్లాపురం తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్‌నాయక్ బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల వ ర్కింగ్ ప్రెసిడెంట్ కలసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జానారెడ్డి సమక్షంలో కాం గ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జానారెడ్డి భాస్కర్‌నాయక్‌కు కాంగ్రెస్ కం డువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జానారెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శక్తివంచనగా కృషి చేసి రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షు డు మెరావత్ మునినాయక్, నాయకులు కుర్ర భీమ్లానాయక్, కుర్ర విజయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

దేవరకొండ, ఏప్రిల్ 17: దైవచింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకు


దేవాలయంలో పూజలు చేస్తున్న రవీంద్రకుమార్

మార్ అన్నారు. దేవరకొండ మండలం జేత్యతండాలో శ్రీరామనవమిని పురస్కరించుకొని బుధవారం అభయ ఆంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం మండలంలోని ఇద్దంపల్లిలో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మల్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ధర్మారెడ్డి, రఘు, రమావత్ నర్సింహ, మాజీ సర్పంచ్ సత్తయ్య, బాల్‌సింగ్, రూపబాయి, శంకర్, కిషన్ పాల్గొన్నారు.

విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి


త్రిపురారం, ఏప్రిల్ 17: వృత్తి విద్యా కోర్సులు చేసే విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పాలిటెక్నిక్ డైరెక్టర్ డాక్టర్ జమునారాణి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన పాలెం డైరెక్టర్ డాక్టర్ మల్లారెడి అన్నారు. త్రిపురారం మండలంలోని కంపాసాగర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల 8వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర కిరణాలు-2024 పేరుతో కళాశాల మ్యాగజైన్‌ను వారు ఆవిష్కరించారు. వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విదార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయ విద్యలో రాణించి క్షేత్రస్థాయిలో రైతులకు మేలు చేకూర్చాలని సూచించారు.


కళాశాల మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

డిండి నుంచి నాన్‌ఆయకట్టుకు నీటి విడుదల

● భూగర్భ జలాల వృద్ధికి అవకాశం

దేవరకొండ/ డిండి, ఏప్రిల్ 17: డిండి ప్రాజెక్టు నుంచి చందంపేట, నేరేడుగొమ్ము మండలాలకు నీటి విడుదలను అధికారులు బుధవారం పోలీసుల రక్షణలో పునరుద్ధరించారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు 200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఏఈ ఫయాజ్ తెలిపారు. డిండి ప్రాజెక్టు నీటిని నాన్ ఆయకట్టు అయిన చందంపేట, నేరేడుగొమ్ము మండలాలకు విడుదల చేయవద్దని డిండి మండల కేంద్రంలోని ఈఈ కార్యాలయం ఎదుట రైతులు మంగళవారం ఆందోళన చేశారు. దీంతో డీఈ శ్రీనివాస్ నీటి విడుదలను నిలిపివేశారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు నీటి విడుదలను పునరుద్ధరించినట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు.



● రెండు మండలాల్లో భూగర్భజలాల వృద్ధి

డిండి ప్రాజెక్టు నీటి విడుదలతో నాన్ ఆయకట్టు అయిన చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని 20చెరువులు, కుంటలకు కాలువల ద్వారా నీరు అందుతుంది. చందంపేట, నేరేడుగొమ్ము మండలాల చెరువులు నింపేందుకు ఈ నెల 15న డిండి ప్రాజెక్టు నీటిని విడుదల చేశారు. నీటి విడుదలతో చెరువులు, కుంటలు నిండటం ద్వారా బోరు, బావుల వద్ద భూగర్భ జలాలు పెరుగుతాయని దీంతో పాటు పశువులు, జీవరాశులకు తాగునీరు అందుతుందని చందంపేట, నేరేడుగొమ్ము మండలాల రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చందంపేట, నేరేడుగొమ్ము మండలంలో ఈ సంవత్సరం వర్షాలు కురవకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి, చెరువులు, కుంటలు వట్టిపోయాయి. డిండి ప్రాజెక్టు ద్వారా కాల్వలకు నీటిని విడుదల చేస్తే బోరు, బావుల్లో నీరు పెరుగుతుందని చెబుతున్నారు. డిండి ప్రాజెక్టు నుంచి నీటి విడుదల ద్వారా చందంపేట, నేరేడుగొమ్ము మండలాలకు మేలు చేకూరనుంది.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

● వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీవీ నారాయణ

దేవరకొండ, ఏప్రిల్ 17: వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీవీ నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. దేవరకొండలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా వడ్డెరులు 45 లక్షలకుపైగా జనాభా కలిగి ఉన్నా గత బీఆర్ఎస్ ప్రభుత్వం వడ్డెరుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. వడ్డెరులకు జనాభా ప్రాతిపాదికన నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, వడ్డెరుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వడ్డెరులకు నిధులు కేటాయించి సహకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రాక్ట్ లైసెన్స్ కలిగిన వడ్డెరులకు పనులలో ప్రాధాన్యత ఇవ్వాలని, వడ్డెరులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి వడ్డెరులను సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రమాదాల్లో మృతి చెందిన వడ్డెరులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో దేవరకొండ మాజీ జడ్పీటీసీ గుంజ రేణుక తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరనున్న జడ్పీటీసీ సురేందర్‌రెడ్డి

మర్రిగూడ, ఏప్రిల్ 17: మర్రిగూడ బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. మర్రిగూడ జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో ప్రధాన వ్యక్తిగా క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం సురేందర్‌రెడ్డితో పాటు ప్రధాన అనుచరులు ముగ్గురు ఎంపీటీసీలు, 50 మంది కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలోనే కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమైనా అనివార్య కారణాల వల్ల కాంగ్రెస్ పార్టీలో చేరలేకపోయారు.

రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు

గుర్రంపోడు, ఏప్రిల్ 17: మండలంలోని ఘాశీరాంతండాలోని రేషన్‌షాపును సివిల్ సప్లయి ఆర్ఐ హబీబ్ బుధవారం తనిఖీ చేశారు. రేషన్‌షాపులో ఉన్న బియ్యం నిల్వలో వ్య త్యాసం ఉండటంతో డీలర్ మెగావత్ లక్ష్మిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న సివిల్ సప్లయి ఆర్ఐ హబీబ్

సంక్షిప్త సమాచారం...

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ టూటౌన్ పరిధిలోని ఇండస్ట్రీయల్ ఫీడర్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా పట్టణంలోని ఎఫ్‌సీఐ, ప్రకాష్‌నగర్, బాపూజీనగర్ ప్రాంతాల్లో గురువారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. కోదాడ - జడ్చర్ల హైవే వెంట ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు, వ్యాపారులు తమకు సహకరించాలని కోరారు.

కేతేపల్లి: స్వచ్ఛంద సేవలందించేందుకు దాతలు ముందుకు రావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్ కోరారు. మండలంలోని భీమారం గ్రామంలో గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బంకు యజమాని బడుగుల నరేందర్, నాయకులు కె.కృష్ణయ్యయాదవ్, రామకృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

కేతేపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి నుంచి పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించి ప్రజల పక్షాన ఉండే వారికి ప్రజల మద్దతు ఉంటుందని రుజువు చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు చినవెంకులు కోరారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో సీపీఎం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లే సీపీఎం ప్రతినిధులు చట్టసభల్లో ఉండాలన్నారు.

చిట్యాల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే ఎండీ జహంగీర్‌ను భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి గెలిపించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య కోరారు. మునిసిపాలిటీ పరిధిలోని వెంకటాపురంలో ప్రచారం నిర్వహించారు. 19వ తేదీన నామినేషన్ సందర్భంగా నిర్వహించే సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, నర్సింహ, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: మండలంలోని అక్కెనపల్లి గ్రామానికి చెందిన మిడిదొడ్డి రాములు, మేడి లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు బియ్యం వితరణ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, అంజయ్య, మహేష్, గిరి, రాంబాబు, దేవేందర్, నరేశ్, రత్నకుమార్, నరేష్, పరమేష్‌లు ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్: ప్రభుత్వం గురుకుల విద్యాలయాలపై దృష్టి సారించాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. యాదాద్రి జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. విషాహారం తిని అస్వస్థతకు గురైన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడని, విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు.

నార్కట్‌పల్లి: ప్రజా ఉద్యమ నాయకుడు నిరంతరం ప్రజల పక్షాన నిలిచే సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించుకోవాలని ఆ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ పిట్టల రవి పిలుపునిచ్చారు. ప్రజా పోరాటాలు చేసిన చరిత్ర ఒక్క సీపీఎంకే ఉందని అన్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ పుచ్చకాయల నర్సిరెడ్డి, ఆదిమల్ల సుధీర్, మండల కార్యదర్శి చెర్కు పెద్దులు, బయ్యన్న, పరమేష్, సైదులు, గోపి పాల్గొన్నారు.

చందంపేట: చందంపేట మండలం పొగిళ్లలో శ్రీ తుల్జా భవాని ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్త్య రమేష్ రూ.1లక్ష 116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయకమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో ఏడుపుల గోవిందు, మాజీ సర్పంచ్ రవి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మర్రిగూడ: భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున అన్నారు. ఎన్నికల్లో భాగంగా బుధవారం మండలంలోని శివన్నగూడ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ నెల 19వ తేదీన నామినేషన్ ఉన్నందున కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సత్తయ్య, యాదయ్య, నరసింహ, యాదయ్య, సోమయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

మర్రిగూడ: మండలంలోని వట్టిపల్లి గ్రామ పంచాయతీలో ఏకశిలపై వెలసిన, శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి మర్రిగూడ మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు అనంత రాజుగౌడ్ రూ.50వేలను ఆర్థికసాయం అందించారు. వట్టిపల్లి గ్రామస్థులు, పెద్దల అభ్యర్థన మేరకు తనవంతు సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజుగౌడ్ మాట్లాడుతూ భగవంతుడి దయతో ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖంగా జీవించాలని, దైవ ప్రార్థనతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శిరసవాడ భిక్షం, ఉపాధ్యక్షుడు మల్గిరెడ్డి నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొంపల్లి నాగరాజుగౌడ్, కోశాధికారి ఎడ్ల కాశయ్య, కార్యవర్గ సభ్యులు మామిడి సత్యనారి, పెద్దలు సత్తయ్య, రమేష్, మల్లేష్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

కొండమల్లేపల్లి: కాంగ్రెస్ పార్టీ నాయకుడు రమావత్ లచ్చిరాం బావోజీ మృతి తీరని లోటని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. కొండమల్లేపల్లి మండలంలోని కోల్‌ముంతలపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని మంత్రియతండాకు చెందిన లచ్చిరాం బావోజీ గుండెపోటుతో మృతి చెందాడు. మృతదేహానికి ఎమ్మెల్యే బాలునాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ జానియాదవ్, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్ రెడ్డి, వేమన్‌రెడ్డి, ఎంపీటీసీ జగన్‌నాయక్, రవినాయక్, యాదగిరి, లాలునాయక్, భాస్కర్‌నాయక్, జేమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బుధవారం మునుగోడులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బీజేపీని గెలిపిస్తే మన ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య యాదవ్, నాయకులు నరేందర్‌గౌడ్, పోలె వెంకటేశ్వర్లు, రాజారాం, క్రాంతి కుమార్, శంకర్‌రెడ్డి, శివరాం, నగేష్ పాల్గొన్నారు. అంతకుముందు పార్టీ అనుబంధ సంఘాల మండల కమిటీ కార్యవర్గాన్ని ప్రకటించినట్లు నాయకులు తెలిపారు.